


మళ్లీ చలిపంజా

రంగారెడ్డి అర్బన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి రంగారెడ్డి జిల్లాపై మళ్లీ చలి పంజా విసిరింది. చలితీవ్రతకు జనం గజగజ వణికిపోతున్నారు. కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే దిగువకు పడిపోయాయి. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం రెడ్డిపల్లిలో అత్యల్పంగా 6.8 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. వికారాబాద్ జిల్లా మోమిన్‌పేటలో 7.8 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదు కాగా, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఉప్పల్ పరిధిలోని మౌలాలిలో 9.5 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది.



ఉపాధ్యాయుల పరస్పర బదిలీలకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఇద్దరి ఒప్పందంతోనే ఈ ట్రాన్స్‌ఫర్లు జరుగుతాయి. అయితే మారుమూల జిల్లాలో ఉన్న జూనియర్ ఉపాధ్యాయులు అర్బన్ ఏరియాకు (హెచ్‌ఆర్ఏ ఉన్న) సమీప ప్రాంతాల్లోని స్కూల్‌కు వచ్చేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. అందుకు లక్షల్లో ముట్టజెప్పేందుకైనా వెనకాడటం లేదు. ప్రధానంగా గ్రేటర్ చుట్టున్న రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలకు వచ్చేందుకు లక్షల్లో ఆఫర్ ఇస్తున్నారు. రిటైర్మెంట్‌కు దగ్గరలో ఉన్న సీనియర్ టీచర్లు కూడా ఏ జిల్లాకైనా వెళ్లేందుకు సిద్ధమవుతుండటంతో పరస్పర బేరసారాలు జరుగుతున్నాయి.

బదిలీలకు బేరసారాలు!

మ్యూచువల్ ట్రాన్స్‌ఫర్లకు భారీ డిమాండ్

రంగారెడ్డి అర్బన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : జీవో 317 కారణంగా నష్టపోయిన ఉపాధ్యాయులకు ఉపశమనం కలిగించేందుకు ప్రభుత్వం తాజాగా సౌజ్, అనారోగ్యం, పరసర్పర బదిలీలకు అనుమతిచ్చింది. దీంతో మ్యూచువల్ బదిలీల దందా కొనసాగుతోంది. మ్యూచువల్ బదిలీ జరగాలంటే మరొకరి అంగీకారం అవసరం. ఇద్దరి సమ్మతితోనే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. గత నెల 31వ తేదీ వరకు ప్రభుత్వం దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించింది. జీవో 317 వల్ల సొంత జిల్లాలను వదిలి ఇతర జిల్లాలకు వెళ్లిన టీచర్లు పరస్పర బదిలీకి సిద్ధమయ్యారు. జీవో 317లో స్థానికతను కాకుండా సీనియారిటీని పరిగణనలోకి తీసుకుని జిల్లాలు కేటాయించిన సంగతి విదితమే. దాంతో సీనియర్లు తాము కోరుకున్న, సొంత జిల్లాలోనే కొనసాగారు. జూనియర్ టీచర్లు మారుమూల జిల్లాకు వెళ్లాల్సి వచ్చింది. ప్రభుత్వం 2022 మార్చిలోనే పరస్పర బదిలీలకు అనుమతి ఇచ్చిన సమయంలో వందల సంఖ్యలో ఈ అవకాశాన్ని వినియోగించుకున్నారు. ఇప్పుడు మరోసారి అవకాశం కల్పించింది. దీంతో 2012, 2017 డీఎస్సీల్లో ఎంపికైన వారిలో ఎక్కువ మంది సొంత జిల్లాలకు తిరిగి వచ్చేందుకు ఆసక్తి చూపుతున్నారు. సౌజ్ కేటగిరీలో అవకాశం దొరకని పరిస్థితి ఉన్న టీచర్లు పరస్పర బదిలీకి ముందుకువస్తున్నారు. ఆరు నెలలు, ఏడాదిలోపు పదవీరమణ పొందే టీచర్లు ఏ జిల్లాకైనా వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నారు. జనవరి, ఫిబ్రవరి నెలలో కొంత మంది టీచర్లు పదవీవిరమణ



పొందనున్నారు. వీరి కోసం అన్వేశించి ఒప్పందం కుదుర్చుకుంటున్నారు. మ్యూచువల్ బదిలీ కోరుకుంటున్న టీచర్లు అర్బన్ ఏరియాకు (హెచ్‌ఆర్ఏ ఉన్న) సమీప ప్రాంతాల్లోని స్కూల్‌కు వచ్చేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. అందుకు లక్షల్లో ముట్టజెప్పేందుకు సిద్ధమయ్యారు. ప్రధానంగా గ్రేటర్ చుట్టున్న రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలకు వచ్చేందుకు గరిష్ఠంగా రూ.20లక్షల వరకు ఆఫర్ ఇచ్చినట్లు తెలుస్తుంది. సౌకర్యవంతమైన జీవితం, పిల్లల ఉన్నత చదువులు, కుటుంబాలకు దగ్గరగా ఉండొచ్చని

మిగతా 8వ పేజీలో...

సాగు భూములకే పెట్టుబడి సాయం

- మహిళా అభ్యున్నతికి ప్రభుత్వ ప్రోత్సాహకాలు
- స్వయం ఉపాధికి వడ్డీలేని రుణాలు
- మహిళా సంఘాలకు చెక్కుల పంపిణీ
- పంచాయతీరాజ్ రోడ్ల అభివృద్ధి
- రాష్ట్ర పంచాయతీరాజ్, గిరిజన, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క



షాద్‌నగర్ - బుగ్గోనిగూడ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న మంత్రి సీతక్క

షాద్‌నగర్ అర్బన్/ నందిగామ జనవరి 4 (ఆంధ్రజ్యోతి): రైతులను ఆదుకోవాలనే ఉద్దేశంతో సాగు చేసే భూములకే పెట్టుబడి సాయం అందిస్తామని రాష్ట్ర పంచాయతీరాజ్, గిరిజన, స్త్రీ మరియు శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనుసూయ అలియాస్ సీతక్క వెల్లడించారు. షాద్‌నగర్ నియోజక వర్గంలో 35 కోట్లతో వ్యయంతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలను చేశారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తో కలిసి మధురాపురం రోడ్డు విస్తరణ కోసం శంకుస్థాపన, గ్రామ మహిళా సంఘం భవనం, కమ్యూనిటి భవనాలను ప్రారంభించారు. ఫరూఖ్‌నగర్ మండల మహిళా సంఘాలకు 50 కోట్ల రూపాయల వడ్డీలేని రుణాల చెక్కును ఇచ్చారు. నందిగామా మండలంలోని అప్పారెడ్డి గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన, షాద్‌నగర్-బుగ్గోనిగూడ రోడ్డు విస్తరణ పనులకు, చేగూరు-సింబయాసిస్ రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేశారు. నందిగామా మండల మహిళా సంఘాలకు 30 కోట్ల వడ్డీలేని రుణాల చెక్కును ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిజమైన రైతులను పక్కనపెట్టి గుట్టలకు, గట్లకు, ఫామ్‌హౌజ్‌లకు సైతం పెట్టుబడి సాయం ఇస్తూ రూ.25 వేల కోట్ల ప్రజాధనాన్ని వృథా చేసిందని ఆరోపించారు. సాగుచేసిన ఫైర్లకు ఏటా రూ.15వేలు, వ్యవసాయ కూలీలకు రైతు భరోసా కింద రూ.12వేలు ఇస్తామని తెలిపారు. అలాగే మహిళల అభ్యున్నతికి ప్రభుత్వ ప్రోత్సాహకాలను అందిస్తున్నామన్నారు. మహిళలు స్వయం ఉపాధిని పొందాలన్న ఆలోచనతో 10వేల వృత్తులను ఎంపిక చేసి, వడ్డీలేని రుణాలను ఇస్తూ ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. మహిళలకు 500 రూపాయలకే వంట గ్యాస్ సిలిండర్‌ను, సోలార్ ప్లాంట్లను, ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పిస్తే బీఆర్ఎస్ నాయకులు ఓర్వలేకపోతున్నారని అన్నారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కోరిక మేరకు షాద్‌నగర్ నియోజక వర్గంలోని పంచాయతీ రోడ్లన్ని అభివృద్ధి చెందడానికి నిధులను మంజూరు చేస్తాని సీతక్క స్పష్టం చేశారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వంలో రోడ్లను అభివృద్ధి చేసి, ప్రజలకు కావల్సిన సౌకర్యాలను కల్పిస్తామని తెలిపారు. నియోజక వర్గ అభివృద్ధికై మంత్రి సీతక్క సహకారం ఉండాలని ఎమ్మెల్యే కోరారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, షాద్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎ. సులోచన కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, ఆర్డీఓ సరిత, పంచాయతీరాజ్ ఈఈ శ్రీనివాస్‌రెడ్డి, డిప్యూటీ ఈఈ శ్రీనివాస్, డీపీఓ సురేష్, సీఈఓ కృష్ణారెడ్డి, డీఆర్‌డీఓ పీడీ శ్రీలత, మాజీ ఎంపీపీ ఎం. ప్రియాంక, ఎం. శివశంకర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ సభ్యుడు ఎం. శ్యాంసుందర్‌రెడ్డి, పి. వెంకట్‌రాంరెడ్డి, తాండ్ర విశాలశ్రవణ్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు ఎల్. శివశంకర్‌రెడ్డి, రాములమ్మ, కావలి కృష్ణ, మాజీ ఎంపీటీసీలు ఎం. భార్గవ్ కుమార్‌రెడ్డి, కొమ్ము కృష్ణ, చంద్రపాల్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు తాండ్ర కాశీనాథ్‌రెడ్డి, జి. బాల్‌రాజ్‌గౌడ్, చెంది తిరుపతిరెడ్డి, ఎల్. శ్రీకాంత్‌రెడ్డి, జంగ నర్సింహ్మా తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి ఘన స్వాగతం

రాష్ట్ర మంత్రి సీతక్కకు షాద్‌నగర్, నందిగామలో కాంగ్రెస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. షాద్‌నగర్ బైపాస్ రోడ్డులో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పుష్పగుచ్ఛాన్ని ఇచ్చి స్వాగతం పలికారు. అనంతరం మధురాపురం గ్రామ మహిళలు బోనాలతో స్వాగతం పలికారు. వీర్లపల్లి గ్రామంలో గజమాలతో పార్టీ కార్యకర్తలు సత్కరించారు.

హుషారుగా జీఎంఆర్ ఎయిర్‌పోర్టు రన్‌ఫన్

- 5 కే, 10 కే రన్‌లో పాల్గొన్న 4,300 రన్నర్స్
- జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించిన జీఎంఆర్ సీఈవో ప్రదీప్ ఫణికర్



జెండా ఊపి రన్‌ను ప్రారంభిస్తున్న సీఈవో ప్రదీప్ ఫణికర్

శంషాబాద్ రూరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలోని జీఎంఆర్ ఎరీనాలో జరిగిన రన్ ఫన్ శనివారం హుషారుగా సాగింది. సాయంత్రం 4.30 గంటలకు జీఎంఆర్ సీఈవో ప్రదీప్ ఫణికర్ జెండా ఊపి 5కే, 10కే రన్‌ను ప్రారంభించారు. వివిధ ప్రాంతాలకు చెందిన 4300 మంది రన్నర్లు పాల్గొన్నారు. రన్ పూర్తయిన తరువాత విజేతలకు బహుమతులు అందజేశారు. పుష్ప సినిమా సింగర్ నకాశ్ అజీజ్ ఆటపాటలతో హుషారెత్తించారు. ఆయన సాంగ్స్‌కు రన్నర్లు డ్యాన్స్‌లు చేశారు. అనంతరం జీఎంఆర్ సీఈవో మాట్లాడుతూ....ప్రతీ ఏడాది 5 కే, 10 కే రన్ నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రతీఒక్కరు ఆర్యోగంతో పాటు ఉల్లాసంగా ఉండాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామని చెప్పారు. శంషాబాద్ జోన్ ఏసీపీ శ్రీనివాస్‌రావు, ఆర్జీఐఏ సీఐ బాల్‌రాజు బందోబస్తును పర్యవేక్షించారు. ఈ రన్‌లో యువతతో పాటు, మహిళలు, వృద్ధులు కూడా పాల్గొన్నారు. కార్యక్రమంలో జీఎంఆర్ అధికారులు, స్పాన్సర్లు తదితరులు పాల్గొన్నారు.

నేడు షాద్‌నగర్‌లో ముత్యాల ముగ్గుల పోటీ

- ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో బుగ్గారెడ్డి గార్డెన్‌లో ఏర్పాట్లు పూర్తి



ముగ్గుల పోటీకి ఏర్పాట్లు చేస్తున్న ఆంధ్రజ్యోతి బృందం

షాద్‌నగర్ అర్బన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఏబీఎన్ ఆంధ్రజ్యోతి దినపత్రిక ప్రతీ సంవత్సరం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ముత్యాల ముగ్గుల పోటీకి షాద్‌నగర్ బుగ్గారెడ్డి గార్డెన్ ముస్తాబైంది. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు నిర్వహించే పోటీలకు శనివారం ఆంధ్రజ్యోతి బృందం, పీడీలు కలిసి ఏర్పాట్లు పూర్తి చేశారు. శతాబ్ది టౌన్‌షిప్ అధినేత కాసు శ్రీనివాస్‌రెడ్డి సౌజన్యంతో ముగ్గుల పోటీలను నిర్వహిస్తున్నారు. బుగ్గారెడ్డి గార్డెన్ అధినేత మనోహర్‌రెడ్డి పోటీలకు ఆతిథ్యం కల్పిస్తున్నారు. పోటీలకు ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, హాజరై విజేతలకు బహుమతులను అందజేస్తారు. మహిళలు అధిక సంఖ్యలో ముగ్గుల పోటీలో పాల్గొనాలని 'ఆంధ్రజ్యోతి' బృందం కోరింది. ఏర్పాట్లలో పీడీలు రాజశేఖర్ రెడ్డి, లక్ష్మయ్య, సేవ్యానాయక్, ఆంధ్రజ్యోతి బృందం సభ్యులు టి.సంజయ్‌కుమార్, ఎల్. మోహన్‌రెడ్డి, బి. వేణుగోపాల్, రామచంద్రయ్య, వై. శేఖర్‌యాదవ్, మల్లేష్, రవికుమార్‌లు పాల్గొన్నారు.

శంకర్‌పల్లిలో ఇస్తేమా షురూ

- భారీగా తరలివచ్చిన ముస్లింలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

శంకర్‌పల్లి, జనవరి4(ఆంధ్రజ్యోతి): శంకర్‌పల్లి పట్టణంలోని జంబోరి ప్రాంగణంలో శనివారం ఇస్తేమా కార్యక్రమం ప్రారంభమైంది. ఉమ్మడి జిల్లా తోపాటు ఇతర ప్రాంతాల నుంచి బస్సులు, వాహనాల్లో ముస్లింలు వేలాదిగా తరలివచ్చారు. వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక స్థలం ఏర్పాటుచేశారు. శనివారం ఉదయం నుంచి మత పెద్దల ప్రసంగాలు, ప్రార్థనలు కొనసాగాయి. ఆదివారం కూడా ఈ కార్యక్రమం కొనసాగనుంది. ఇస్తేమాలో వలంటీర్లు స్వచ్ఛందంగా సేవ చేశారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పోలీసులు పకడ్బందీ చర్యలు తీసుకున్నారు.

ఇస్తేమాను సందర్శించిన ఎమ్మెల్యే

ఇస్తేమా జరుగుతున్న ప్రాంతాన్ని చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య సందర్శించారు. ముస్లిం మత పెద్దలతో సమావేశమై ఏర్పాట్లపై చర్చించారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఇస్తేమాలో ఏర్పాటు చేసిన ఆసుపత్రిని సందర్శించి చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించారు. అదే విధంగా పోలీస్, మున్సిపల్ కంట్రోల్ కేంద్రాలను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో నార్సింగి ఏసీపీ రమణ గౌడ్, ఆర్డీఓ చంద్రకళ, శంకర్‌పల్లి తహసీల్దార్ సురేందర్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, సీఐలు శ్రీనివాస్‌గౌడ్, వీరబాబు. నాయకులు ప్రవీణ్‌కుమార్, వెంకట్‌రెడ్డి, రఘునందర్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.



కేంద్రం నుంచి రాష్ట్రానికి అధిక నిధులు



మాట్లాడుతున్న ఎంపీ విశ్వేశ్వర్ రెడ్డి

ధారూరు, జనవరి4(ఆంధ్రజ్యోతి): కేంద్రం నుంచి తెలంగాణకు అధిక నిధులు మంజూరవుతున్నాయని చేవేళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని నాగారం గ్రామంలో శనివారం బీఎస్ఎన్ఎల్ 4జీ సెల్ టవర్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పంటలకు మద్దతు ధర కోసం కేంద్రం రూ.22 వేల కోట్లు ఇచ్చిందని చెప్పారు. పదేండ్లలో దేశం ఐదింతల అభివృద్ధి చెందిందని పేర్కొన్నారు. విద్యారంగానికి రాష్ట్ర ప్రభుత్వం అతి తక్కువ నిధులు కేటాయిస్తుండటంతో పాఠశాల విద్యలో వెనుకబడిందని ఆరోపించారు. తాండూరు-పరిగి-రాస్నం, నాగారం నుంచి రాజాపూర్ గ్రామాల బీటీ రోడ్ల మరమ్మతులకు నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. నాగారంలో పెట్రోల్ పంపు ఏర్పాటు, కోట్‌పల్లి ప్రాజెక్టును పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో బీఎస్ఎన్ఎల్ రాష్ట్ర ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ విజయ్‌కుమార్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, పీఏసీఎస్ ఛైర్మన్ సత్యనారాయణ రెడ్డి, నాయకులు బీజేపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ వడ్లనందు, హన్మంత్ రెడ్డి, రమేశ్, పాండుగౌడ్, వివేకానంద రెడ్డి, రాజునాయక్ పాల్గొన్నారు.

అయ్యప్ప స్వాములకు అన్నదానం



షాబాద్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): తెలంగాణ జాగృతి షాద్‌నగర్ నియోజకవర్గ కన్వీనర్ డాక్టర్ ఎండీ ముస్తఫా షాబాద్ మండల కేంద్రంలోని హనుమాన్ ఆలయంలో శనివారం అయ్యప్ప స్వాములకు భిక్ష ఏర్పాటు చేసి స్వయంగా వడ్డించారు. ఈ సందర్భంగా స్వాములు మాట్లాడుతూ.. మతసామరస్యానికి ప్రతీకగా కలిసిమెలిసి ఉండాలన్నారు. కార్యక్రమంలో గురుస్వాములు రవీందర్‌గౌడ్, బాల్‌రాజ్, జడల రాజేందర్‌గౌడ్, మహేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

రాజకీయాలతో సంబంధం లేకుండా పని చేయాలి



ఆలయ కమిటీ చైర్మన్‌గా నియామకపత్రం అందుకుంటున్న అల్లె కుమార్

మహేశ్వరం, జనవరి 4(ఆంధ్రజ్యోతి): రాజకీయాలతో సంబంధం లేకుండా మహేశ్వరం శ్రీ శివగంగ రాజరాజేశ్వరాలయ అభివృద్ధికి ప్రతిఒక్కరూ ముందుకు రావాలని మాజీ ఎమ్మెల్యే, కంగ్రెస్ మహేశ్వరం ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరయ్యారు. చైర్మన్‌గా అల్లె కుమార్, కమిటీ డైరెక్టర్లు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ తీగల అనితా రెడ్డి, దేప భాస్కర్‌రెడ్డి, జంగారెడ్డి, రఘుమారెడ్డి, అంద్యానాయక్, కాకి ఈశ్వర్, ఆలయ ఈవో మురళీకృష్ణ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీ పరీక్షకు ఎంపిక



బహుమతి అందుకుంటున్న కంకల్ విద్యార్థి ప్రకాష్

పూడూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కంకల్‌కు చెందిన విద్యార్థి రాష్ట్ర స్థాయి పోటీ పరీక్షకు ఎంపికయ్యాడు. రాష్ట్రస్థాయి సాంఘిక శాస్త్ర ఫోరం సూచనల మేరకు జిల్లా, మండల స్థాయిలో ప్రతిభ పరీక్షను నిర్వహించారు. ఇందులో ప్రతిభ చూపిన విద్యార్థులకు శనివారం జిల్లా స్థాయి పరీక్ష నిర్వహించారు. ఇందులో మండల పరిధిలోని కంకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి ప్రకాష్ ప్రతిభ కనబరిచాడు. రాష్ట్రస్థాయి పోటీ పరీక్షకు ఎంపికైన విద్యార్థి గైడ్ టీచర్ చంద్రమోహన్‌తో కలిసి బహుమతి అందుకున్నాడు. ఈ సందర్భంగా విద్యార్థి ప్రకాష్, గైడ్ టీచర్ చంద్రమోహన్‌ను ప్రధానోపాధ్యాయురాలు పుష్ప, ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ చైర్మన్ సోని అభినందించారు.

విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలి



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఆర్డీవో చంద్రకళ, తహసీల్దార్

శంకర్‌పల్లి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని చేవెళ్ల ఆర్డీవో చంద్రకళ అన్నారు. శంకర్‌పల్లిలోని ఎస్సీ బాలుర వసతిగృహాన్ని శనివారం రాత్రి తహసీల్దార్ సురేందర్‌తో కలిసి తనిఖీ చేశారు. విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకొని, వారితో కలిసి భోజనం చేశారు. సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తేవాలని సూచించారు. దోమల నివారణకు మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి మందు స్ప్రే చేయించాలని డిప్యూటీ తహసీల్దార్ బాలకృష్ణారెడ్డిని ఆదేశించారు. దాతల సహకారంతో విద్యార్థులకు సహాయసహకారాలు అందించాలని, విద్యార్థులకు ఎలాంటి సమస్యలు రాకుండా చూసుకోవాలని, నాణ్యమైన భోజనం అందించాలని వార్డెన్ పాండును ఆదేశించారు. పట్టణంలోని సింగాపురానికి చెందిన డాక్యుమెంట్ రైటర్ చెన్నారెడ్డి విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేయగా ఆమె వాటిని విద్యార్థులకు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాములు, బాల్‌రాజ్, వీఆర్‌ఏ రాజశేఖర్ ఉన్నారు.

చదువు రావడం లేదని విద్యార్థిని ఆత్మహత్య

మూడుచింతలపల్లి, జనవరి 4(ఆంధ్రజ్యోతి): 'ఏంటిరా బాబు నా జీవితం.. పిచ్చి లేస్తుంది, ఏమీ రావు, ఎప్పుడూ తినడం, పడుకోవడం.. ఏంటి నా లైఫ్.. అస్సలు నాకు నిజంగానే ఏమీ రావా, ఏంటి అసలు నా లైఫ్ మొత్తం ఇలానే ఉంటుందా? నాకు అంటూ ఎవరూ లేరా.. నా జీవితం.. చచ్చిపోవాలనిపిస్తుంది..' అని సూసైడ్ నోట్ రాసి ఓ బాలిక ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన జీనోమ్‌వ్యాలీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తుర్కపల్లిలోని ఉమాశంకర్ రైస్‌మిల్‌లో పని చేస్తున్న నాగవెంకటరమణ, లక్ష్మీ దంపతుల కూతురు (16)స్థానిక విజేత టెక్నో పాఠశాలలో పదో తరగతి చదువుతుంది. ఎంత చదివినా గుర్తు ఉండటం లేదని, చదువు రాదని జీవితంపై విరక్తి చెందింది. శుక్రవారం నోట్ బుక్‌లో సూసైడ్‌నోట్ రాసి ఇంట్లోని బాత్‌రూంలో చీరతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఉదయం తల్లి బాత్‌రూమ్‌కు వెళ్లగా కూతురు ఉరివేసుకొని వేలాడుతుండడాన్ని చూసి విస్మయానికి లోనైంది. ఈ విషయాన్ని కుటుంబసభ్యులకు, పోలీసులకు తెలిపింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని శవ పంచనామా నిర్వహించి, పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యారంగ సమస్యలపై రాజీలేని పోరాటం

కడ్తాల్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యలపై ఏబీవీపీ రాజీలేని పోరాటం చేస్తుందని రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కందాడి శ్రీరామ్ అన్నారు. కడ్తాల్‌లో శనివారం ఏబీవీపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. అఖిల భారత విద్యార్థి పరిషత్ కడ్తాల నగర నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యదర్శిగా నేనావత్ పవన్, ఉపాధ్యక్షుడిగా ఉమేశ్, సంయుక్త కార్యదర్శిగా శ్రీకాంత్, స్టూడెంట్ ఫర్ డెవలప్‌మెంట్ కన్వీనర్‌గా అఖిల్, క్రీడా కన్వీనర్‌గా గణేశ్, విద్యార్థి సేవ కన్వీనర్‌గా దశరథం, కార్యవర్గ సభ్యులుగా నరేందర్, సందీప్, పవన్, దిలీప్ ఎన్నికయ్యారు. ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు క్యామ శ్రీకాంత్ ఉన్నారు.



ఆధార్ కార్డు తరహాలో గుర్తింపు కార్డు

- ఎల్‌కేజీ నుంచి పీజీ వరకు వివరాలు నిక్షిప్తం
- వన్ నేషన్ - వన్ ఐడీ పేరుతో కార్డు జారీ
- తల్లిదండ్రుల అంగీకరంతో ప్రక్రియకు శ్రీకారం
- చేవెళ్ల డివిజన్‌లో మొదలైన నమోదు కార్యక్రమం

విద్యార్థుల భవిష్యత్తుకు అపార్

చేవెళ్ల, జనవరి 4(ఆంధ్రజ్యోతి): జాతీయ విద్యావిధానంలో భాగంగా దేశంలో ప్రతీ విద్యార్థి విద్యార్హతల వివరాలు ఒకే కార్డులో నిక్షిప్తం చేయాలన్న ఉద్దేశంతో కేంద్రం ఆటోమేటెడ్ పర్మినెంట్ అకాడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ (ఏపీఏఏఆర్ లేదా అపార్) ఐడీ కార్డులు రూపొందిస్తుంది. దేశవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థల్లో ఎల్‌కేజీ నుంచి పీజీ వరకు చదువుతున్న విద్యార్థులకు పర్మనెంట్ నంబర్‌తో కూడిన గుర్తింపు కార్డు ఇస్తారు. ఆధార్ తరహాలో వన్ నేషన్-వన్ ఐడీ పేరుతో 11 అంకెలతో అపార్ కార్డును అందుబాటులోకి తీసుకొచ్చింది. కార్డు జారీకి రాష్ట్ర, కేంద్ర విద్యాశాఖలకు ఆదేశాలు వచ్చాయి. విద్యార్థి తల్లిదండ్రులు అపార్ ఐడీ నంబర్ కోసం దరఖాస్తు చేసుకుంటే పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అపార్ నమోదు ప్రక్రియను మొదలు పెడతారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల అవగాహనతోనే సాధ్యమవుతుందని అధికారులు ఇప్పటికే ఉపాధ్యాయులకు, విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.

శాశ్వత గుర్తింపు సంఖ్య

అపార్‌తో ప్రతి విద్యార్థికీ శాశ్వతంగా ప్రత్యేక గుర్తింపు కార్డు సంఖ్య ఇవ్వనుంది. జిల్లా విద్యాశాఖను ఒక యూనిట్‌గా తీసుకొని ప్రతి మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య, వారి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. దీంతో ఒక పాఠశాల నుంచి మరో పాఠశాలకు బదిలీ సులభతరం కానుంది. రివార్డులు, డిగ్రీలు, స్కాలర్‌షిప్‌లు, ఉన్నత విద్యకు అవార్డులు, ప్రాజెక్టులు, ఇంటర్వ్యూలు, ఇతర పూర్తి అకాడమిక్ డాటాను డిజిటలైజేషన్ చేయనున్నారు. అపార్‌కార్డు ద్వారా విద్యార్థుల ప్రతిభానైపుణ్యాలు ఏమిటన్న విషయాలు సులువుగా తెలుసుకునే వీలుంటుంది. ఉద్యోగ దరఖాస్తుల్లో ఈ కార్డు ప్రామాణికం కానుంది. ఈ వివరాలు కేంద్రం తప్ప ఇతరులు తెలుసుకోలేరు. ప్రీప్రైమరీ నుంచి ఉన్నత విద్య చదివే ప్రతి విద్యార్థికీ పాఠశాల, కళాశాలలు ఈ కార్డులు జారీ చేస్తాయి. వివిధ కారణాలతో తల్లిదండ్రులు బదిలీ అయినప్పుడు విద్యార్థులు ఒక పాఠశాల నుంచి మరో పాఠశాలో చేరినా పర్మినెంట్ నంబర్ మారదు. విద్యార్థుల సంఖ్య, ఉచిత పాఠ్యపుస్తకాలు, స్కూల్ యూనిఫామ్‌లు, మధ్యాహ్న భోజన పథకం పకడ్బందీగా అమలయ్యేందుకు ఈ కార్డు ఉపయోగపడనుంది.

ఎదురవుతున్న సమస్యలివి..

- అపార్ నమోదు విషయంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు ఆసక్తి చూపించడం లేదు.
- విద్యార్థుల ఆధార్ కార్డుల్లో తప్పులుంటున్నాయి. పుట్టిన తేదీ, ఇంటిపేరు, పేరు, చిరునామాల్లో అనేక అక్షరదోషాలు ఉంటున్నాయి. వీటిని సరిచేసుకొని వచ్చే సరికి వారం లేదా 10 రోజులు సమయం పడుతోంది.
- కొందరు విద్యార్థుల వివరాలు స్కూల్ రిజిస్టర్‌లో, విద్యా శాఖ వద్ద తప్పుగా ఉన్నాయి. వీటిని ముందు ఎడిట్ చేయాల్సి ఉంటుంది. ప్రతీ మండలంలో దొర్లిన తప్పులను ఎంఐఎస్ కోఆర్డినేటర్ సాయంతో ఎడిట్ చేస్తున్నారు.
- అపార్ కార్డు వివరాల నమోదుకు తల్లిదండ్రుల ఆమోదం తప్పనిసరి. కానీ, చాలా మంది తల్లిదండ్రులకు విద్యార్థులకు సమాచార, సమన్వయంతో ఈ కాన్సెంట్ లెటర్లు ఇవ్వడంలో జాప్యం జరుగుతోంది.

పాఠశాలల్లో ఏర్పాట్లు పూర్తి

ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో అపార్ వివరాలు ఆన్‌లైన్ చేయసేందుకు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తయ్యాయి. వాటిని ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలల యాజమాన్యాలు యూడైస్‌లో పొందుపరుస్తారు. లాగిన్ అయ్యాక స్కూల్ రిజిస్టర్‌లో ఉన్న వివరాలను, పిల్లలు తీసుకువచ్చిన ఆధార్ కార్డు వివరాలను పోల్చి చూస్తారు. సరిపోతే నమోదు చేస్తారు. తేడాలుంటే, ఆధార్‌లో లేకపోతే స్కూల్ రిజిస్టర్‌లో మార్పులు చేస్తారు.



ప్రభుత్వం పాఠశాలలకు జారీ చేసిన పత్రం

చేవెళ్ల డివిజన్‌లో పాఠశాలలు ఇలా..

చేవెళ్ల మండలంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు కలిపి 90 ఉన్నాయి. మొత్తం 10 వేల మంది విద్యార్థులు ఉన్నారు. షాబాద్ మండలంలో 66 ఉన్నాయి. ఇందులో 14500 వేల మంది విద్యార్థులు ఉన్నారు. శంకర్‌పల్లి మండలంలో 66 పాఠశాలలకు గాను 18,010 మంది విద్యార్థులున్నారు. మొయినాబాద్ మండలంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు 91 ఉన్నాయి. 15,000 మంది విద్యార్థులున్నారు.

విద్యార్థి పూర్తి సమాచారం ఉంటుంది



ప్రతి విద్యార్థికి సంబంధించిన పూర్తి సమాచారం తెలుసుకునేందుకు ఆధార్ కార్డు తరహాలో అపార్ కార్డును కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. తల్లిదండ్రులు అంగీకరం తెలుపుతూ దరఖాస్తు పంపిస్తున్నాం. అపార్ లేదా పెన్ కార్డుతో పాఠశాల యాజమాన్యాలు ఆన్‌లైన్‌లో యూడైస్‌లో విద్యార్థుల వివరాలను నమోదు చేసే క్రమంలో ఆటోమోటిక్ పెన్ జనరేట్ అవుతుంది. ప్రతి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విద్యార్థులకు టీసీ ఇచ్చే క్రమంలో టీసీపై నంబర్ తప్పనిసరిగా రాయాలి. దీంతో విద్యార్థి పూర్తి సమాచారం తెలుస్తుంది. ఇప్పటికే అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ప్రక్రియ మొదలైంది.

- పురందాస్, ఎంఈవో, చేవెళ్ల



డీఎంహెచ్‌వోకు ఫిర్యాదు చేస్తున్న ఏఐకేఎంఎస్ నాయకులు

'సాధన' ఆస్పత్రిపై చర్యలు తీసుకోవాలి

వికారాబాద్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): పరిగి పట్టణంలో మహిళా మృతికి కారణమైన సాధన మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిపై చర్యలు తీసుకోవాలని ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షకార్యదర్శులు మహేందర్, మల్లేశ్ పేర్కొన్నారు. శనివారం జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆస్పత్రిలో వైద్యుల నిర్లక్ష్యంతో మహిళ మృతి చెందిన ఘటనపై సమగ్రమైన విచారణ జరిపి ఆస్పత్రి యాజమాన్యం, వైద్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షురాలు రాములు, నాయకులు నర్సింహులు, వెంకటయ్య, పాల్గొన్నారు.

పంచాయతీ ఎన్నికలనాటికి కమిటీల ఏర్పాటు

టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్



మహేశ్‌కుమార్‌గౌడ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న కిచ్చన్న, భాస్కర్‌రెడ్డి

మహేశ్వరం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల నాటికి గ్రామ స్థాయి నుంచి పార్టీకి సంబంధించి అన్ని కమిటీలను ఎన్నుకుంటామని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ చెప్పారని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ మహేశ్వరం ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం టీపీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డితో కలిసి మహేశ్‌కుమార్ గౌడ్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో కాంగ్రెస్ బలోపేతం, కమిటీల నియామకం, అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై చర్చించినట్టు తెలిపారు. ప్రభుత్వం అమలుచేస్తున్న ఆరు గ్యారెంటీలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారన్నారు. పార్టీ ఎదుగుదలకు కష్టపడ్డ ప్రతీ కార్యకర్తకూ అండగా ఉంటామన్నారు.

సంక్రాంతిలోపు రైతు భరోసా

- సాగులో ఉన్న ప్రతీ ఎకరాకు పెట్టుబడి సాయం
- శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్



క్యాంపు కార్యాలయం వద్ద కల్యాణ లక్ష్మి చెక్కు పంపిణీ చేస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

వికారాబాద్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగలోపు రైతులకు రైతు భరోసా డబ్బులు ప్రభుత్వం అందిస్తుందని, సాగులో ఉన్న ప్రతీ ఎకరాకు పెట్టుబడి సాయం అందుతుందని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. శనివారం వికారాబాద్ పట్టణంలోని మార్కెట్ యార్డులో రూ.70 లక్షలతో అభివృద్ధి పనులు ప్రారంభించి అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ఆవరణలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఉపాధి హామీ కార్డు ఉన్న లబ్ధిదారులకు రూ. 12 వేల ఆర్థిక సహాయాన్ని అందజేస్తామన్నారు. మార్కెట్ కమిటీ భవన ఆవరణలో రూ.70 లక్షలతో అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. వికారాబాద్ నియోజకవర్గానికి మొదటి విడతలో 12 వేల ఇళ్లు మంజూరయ్యాయన్నారు. స్థలం లేని వారికి స్థలం ఇచ్చి ఇల్లు కట్టిస్తామన్నారు. ముందుగా పూజా కార్యక్రమం నిర్వహించి అంబేద్కర్, తెలంగాణ తల్లి చిత్రపటాలకు స్పీకర్ పూలమాలలు వేశారు. స్పీకర్‌కు మార్కెట్ కమిటీ సిబ్బంది సభాపతికి నాగలిని బహూకరించారు. జిల్లా మార్కెటింగ్ అధికారి సారంగపాణి, ఆర్డీవో వాసుచంద్ర, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, మార్కెట్ కమిటీ ఇన్‌చార్జి ఎండి రియాజ్, కార్యదర్శి ఎండీ ఫసియోద్దీన్, డీసీసీబీ డైరెక్టర్ కిషన్ నాయక్, మునిసిపల్ చైర్ పర్సన్ మంజుల రమేష్, ఫ్లోర్ లీడర్ సుధాకర్ రెడ్డి, మాజీ మునిసిపల్ చైర్మన్ సత్యనారాయణ, మహిపాల్ రెడ్డి, రత్నారెడ్డి పాల్గొన్నారు.

మా సమస్యలు పరిష్కరించాలి

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం సర్వశిక్షా ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు గంగ్యానాయక్ అన్నారు. వికారాబాద్‌లో ధర్నాలో భాగంగా ర్యాలీగా వెళ్తున్న సమయంలో క్యాంపు కార్యాలయానికి వెళ్తున్న స్పీకర్ వారిని చూసి కారు ఆపారు. అదే సమయంలో ఉద్యోగులు పెద్ద ఎత్తున కారుకు అడ్డుగా వచ్చి మీద పడడంతో పోలీసులు వారిని అదుపు చేసేందుకు పక్కకు తోయడంతో అక్కడ గందరగోళ పరిస్థితి ఏర్పడింది. దీంతో స్పీకర్ పక్కనే ఉన్న క్యాంపు కార్యాలయానికి కొందరూ రావాలని చెప్పి వెళ్లిపోయారు. తర్వాత పోలీసులకు, ఉద్యోగుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. పలువురు ఉద్యోగులు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో స్పీకర్‌ను కలిసి ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించాలని, చిన్న పిల్లలతో రోడ్లపై కూర్చొని ధర్నా చేస్తున్న పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్పీకర్ మీ విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని, ఎవరూ ఆందోళన చెందవద్దని కోరారు. ప్రభుత్వం సరైన న్యాయం చేస్తుందని హామీ ఇచ్చారు.

ప్రతీ కూలీకి రూ.12 వేలు

మర్పల్లి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండగ లోపు ప్రతీ కూలీ బ్యాంకు ఖాతాలో రూ.12 వేలు జమ చేస్తామని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. శనివారం మర్పల్లి మండల కేంద్రంలో కల్యాణ లక్ష్మి, షాదీముబారక్, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం మండలంలోని తుమ్మలపల్లి గ్రామంలో రూ.45 లక్షలతో అండర్ డ్రైనేజీ, రూ.20 లక్షలతో సీసీ రోడ్డు పనులకు భూమి పూజ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ త్వరలోనే రైతు భరోసా, గృహలక్ష్మీ పథకాలు అమలు చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు మర్పల్లి మండలంలో రూ.104 కోట్ల నిధులతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, కాంగ్రెస్ బ్లాక్ టు అధ్యక్షుడు కృష్ణారెడ్డి, జిల్లా నాయకులు రాములు యాదవ్, రామేశ్వర్, ఉప్పరి నాగేశ్, కలీమోద్దీన్, శంకరయ్యగౌడ్, నర్సిములు, పార్టీ మండల అధ్యక్షుడు సురేశ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

పార్టీలు వేరైనా కలిసి పనిచేస్తా..

తాండూరు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు ఇప్పటివరకు కేంద్రం రూ.12 కోట్లు వివిధ అభివృద్ధి పనులకు కేటాయించిందని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. సమర్థుడినే బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నుకుంటామని తెలిపారు. శనివారం తాండూరు పట్టణంలోని సాయిపూర్ గిరిజన ఆశ్రమ పాఠశాలను సందర్శించి అస్వస్థతకు గురైన విద్యార్థినులను పరామర్శించారు. అనంతరం మాట్లాడుతూ పార్టీలు వేరైనా కలిసి పని చేస్తానని తెలిపారు. తాండూరులో 40 ఏళ్ల పార్టీకి సేవలందించిన మున్సిపల్ మాజీ చైర్మన్ స్వర్గీయ నాగారం నర్సింహులు సేవలను గుర్తించి ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించామని పేర్కొన్నారు. ఎంపీ నిధులు రూ.5 కోట్లే ఉన్నందున ఒక్కో నియోజకవర్గానికి రూ.71 లక్షలు మాత్రమే కేటాయిస్తున్నట్లు చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో చేవెళ్లలో 50 శాతం గ్రామ పంచాయతీలను గెలుచుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆయనవెంట బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమేశ్‌కుమార్, మహిళా మోర్చా రాష్ట్ర నాయకురాలు శ్రీలత, కౌన్సిలర్ లావణ్య బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాగారం మల్లేశం, బీఎస్ఎన్ఎల్ కమిటీ సభ్యుడు గాజుల శాంత్‌కుమార్ ఉన్నారు.

ప్రభుత్వ భూమిలో బోర్డులు ఏర్పాటు

శంషాబాద్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): కోత్వాల్‌గూడ గ్రామంలోని 52 ఎకరాలు ప్రభుత్వానికి చెందినదని తహసీల్దార్ రవీందర్‌దత్ తెలిపారు. శనివారం సిబ్బందితో బోర్డులు ఏర్పాటు చేయించారు. అనంతరం మాట్లాడుతూ దాదాపు రూ.250 కోట్ల విలువచేసే భూములను కాపాడటానికి న్యాయస్థానంలో రెవెన్యూ సిబ్బంది పోరాటం చేశారని, ఈ భూముల్లో ప్రస్తుతం కొన్ని నిర్మాణాలతో పాటు ఓ కన్వెన్షన్‌ను గుర్తించామన్నారు. త్వరలోనే అధికారుల ఆదేశాలతో నిర్మాణాలను తొలిగిస్తామన్నారు. ఆ భూములను ప్రజల అవసరాల నిమిత్తం వినియోగిస్తామని తెలిపారు. ఈ భూముల విషయంలో కోర్టు ఆదేశాలతో తమ సిబ్బందితో బోర్డులు ఏర్పాటు చేశామని వివరించారు.

రూ.26 కోట్లతో పరిగి ఆస్పత్రి విస్తరణ

- 30 నుంచి 100 బెడ్లకు పెంపు
- పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



పరిగి ఆస్పత్రిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): పరిగి ప్రభుత్వాస్పత్రిని రూ.26 కోట్లతో అభివృద్ధి చేస్తున్నట్లు పరిగి ఎమ్మెల్యే డాక్టర్ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. శనివారం పరిగి ఆస్పత్రిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆస్పత్రి పరిసరాలను పరిశీలించి పాతభవనాలను కూల్చివేసి వాటి స్థానంలో కొత్త భవన నిర్మాణాలను ప్రారంభించాలని డీఈ లక్ష్మీనారాయణకు సూచించారు. ప్రజలందరికీ మెరుగైన ఉచిత వైద్యం అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. అత్యాధునిక సాంకేతికతతో భవన నిర్మాణం, అన్ని రకాల చికిత్సకు అవసరపడే పరికరాలు, ఫర్నిచర్ సమకూరుస్తామని చెప్పారు. ఇప్పటికే టెండర్ల ప్రక్రియ పూర్తయిందని, త్వరలోనే శంకుస్థాపన చేస్తామన్నారు. అత్యవసర సేవలు అందేలా అభివృద్ధి చేస్తామని తెలిపారు. జాతీయ రహదారి ఉండడం వల్ల ఇక్కడ ఎక్కువగా ప్రమాదాలు సంభవిస్తున్నాయని, ప్రతి చిన్నదానికీ నగరానికి రెఫర్ చేయకుండా అన్ని వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పరిగి వయా నస్కల్, వికారాబాద్, పరిగి-షాద్‌నగర్, గడిసింగాపూర్ - రంగారెడ్డిపల్లి వరకు రోడ్ల విస్తరణకు రూ.340 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. సమావేశంలో డీసీహెచ్‌ఎం ప్రదీప్‌కుమార్, పరిగి సూపరింటెండెంట్ రాజశేఖర్, అనస్తీషియా వైద్యుడు వెంకటరత్నం, ఏఎంసీ చైర్మన్ పరశురామ్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణప్రసాద్, ప్రధానకార్యదర్శి హన్మంత్ ముదిరాజ్, పట్టణ అధ్యక్షుడు కృష్ణ, దోమ పీఏసీఎస్ చైర్మన్ యాదవరెడ్డి, డీసీసీ కార్యదర్శి రామకృష్ణ పాల్గొన్నారు.

బ్యాంక్ ఏర్పాటు చేయాలని ఎంపీకి వినతి



ఎంపీ మల్లు రవికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

తలకొండపల్లి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): గట్టిప్పలపల్లి గ్రామంలో జాతీయ బ్యాంక్‌ను ఏర్పాటు చేయించాలని గ్రామ నాయకులు నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ మల్లు రవిని కోరారు. శనివారం ఈ మేరకు హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి వినతి పత్రం అందజేశారు. బ్యాంక్ ఏర్పాటుతో సమీప పది గ్రామాలు, తండాల ప్రజలకు సౌకర్యంగా ఉంటుందని తెలిపారు. బ్యాంక్ ఏర్పాటుకు సంబంధిత అధికారులతో మాట్లాడుతానని మల్లు రవి హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. నాయకులు ప్రశాంత్‌రెడ్డి, రేణురెడ్డి, శివకుమార్‌గౌడ్, కిషన్, మధుసూదన్‌రెడ్డి, సురేశ్, మహేశ్ ఉన్నారు.

పోలీసుల తీరు అమానుషం

వికారాబాద్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్షా మహిళా ఉద్యోగుల పట్ల పోలీసుల తీరు అమానుషమని సమగ్రశిక్షా ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు గంగ్యానాయక్, ప్రభావతి అన్నారు. స్పీకర్ పర్యటన నేపథ్యంలో సమగ్రశిక్షా ఉద్యోగులు ఆయనను కలిసి విజ్ఞప్తి చేసే క్రమంలో పోలీసులు మానవత్వం మరిచి ప్రవర్తించారన్నారు. మహిళలనీ చూడకుండా ఇష్టం వచ్చినట్లు నెట్టడంతో పాటు మహిళా ఉద్యోగులపై దురుసుగా ప్రవర్తించారని అన్నారు. వెంటనే పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న అంజయ్య యాదవ్

గెలుపోటములను సమానంగా స్వీకరించాలి

చౌదరిగూడ, జనవరి 4(ఆంధ్రజ్యోతి): గెలుపోటములను సమానంగా భావించి ముందుకు సాగాలని మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. శనివారం జిల్లేడ్ చౌదరిగూడ మండలం పెద్దఎల్కిచర్లలో ఈపీఎల్ సీజన్-5 ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలను ప్రారంభించారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు హఫీజ్, కొందుర్గు మాజీవైస్ ఎంపీపీ రాజేష్, సింగిల్‌విండో డైరెక్టర్ జబ్బార్, బాబురావు, సత్యప్రమోద్, నర్సింహులు, శేఖర్, పాండు, గౌస్ తదితరులున్నారు.

కార్యకర్తల కుటుంబాలకు అండగా బీఆర్ఎస్

ఆమనగల్లు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తల కుటుంబాలకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ అన్నారు. అనారోగ్యానికి గురై చికిత్స పొందుతున్న మరిగుంత తండా మాజీ సర్పంచ్ ఇస్లావత్ శ్రీనునాయక్‌ను శనివారం బీఆర్ఎస్ నాయకులతో కలిసి జైపాల్ యాదవ్ పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు.

దూరభారం.. ఏసీపీ కార్యాలయం

- కొత్తూర్, నందిగామ పీఎస్‌లు శంషాబాద్ ఏసీపీ పరిధిలో కొనసాగింపు
- షాద్‌నగర్ పరిధిలోకి తేవాలని ఆయా మండల ప్రజల డిమాండ్
- దూరభారంతో పాటు సమయం వృథా.. అధికారులు చొరవ తీసుకోవాలని విన్నపం



కొత్తూర్ పోలీస్‌స్టేషన్

కొత్తూర్, జనవరి 4(ఆంధ్రజ్యోతి) నియోజకవర్గం హెడ్‌క్వార్టర్స్ ఓ వైపు, ఏసీపీ కార్యాలయం మరో వైపు ఉండడంతో రెండు మండలాల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. షాద్‌నగర్ ఏసీపీ కార్యాలయ పరిధిలో నియోజకవర్గంలోని మండలాలైన ఫరూఖ్‌నగర్, కొత్తూర్, నందిగామ, కేశంపేట, కొందుర్గు, చౌదరిగూడ మండలాలు ఉండేవి. రెండు సంవత్సరాల క్రితం కొత్తూర్, నందిగామ పోలీస్‌స్టేషన్లను శంషాబాద్ ఏసీపీ కార్యాలయ పరిధిలోకి మారుస్తూ పోలీస్ ఉన్నతాధికారుల చేత ఉత్తర్వులు జారీ చేయబడ్డాయి. దాంతో ఆయా మండలాలకు చెందిన ప్రజలు శంషాబాద్ ఏసీపీ కార్యాలయ పరిధిలోకి తమ పోలీస్‌స్టేషన్లను మర్చవద్దని అప్పటి షాద్‌నగర్ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ దృష్టికి తీసుకెళ్లారు. దాంతో కొత్తూర్, నందిగామ పోలీస్‌స్టేషన్లను షాద్‌నగర్ ఏసీపీ పరిధిలోనే ఉంచాలని ఎమ్మెల్యే పోలీస్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ఉత్తర్వులను నిలిపివేయించారు. కొద్ది నెలల తర్వాత పోలీస్ ఉన్నతాధికారులు తిరిగి ఉత్తర్వులు జారీ చేస్తూ, కొత్తూర్, నందిగామ పోలీస్‌స్టేషన్ పరిధిలను శంషాబాద్ ఏసీపీ పరిధిలోకి మార్చాలని ఆదేశించారు. ప్రస్తుతం కొత్తూర్, నందిగామ పోలీస్‌స్టేషన్లు శంషాబాద్ ఏసీపీ పరిధిలోనే కొనసాగుతున్నాయి. షాద్‌నగర్ పట్టణంలో ఏసీపీ కార్యాలయంతో పాటు, ఆర్డీవో, తదితర డివిజన్ కార్యాలయాలు ఉన్నాయి. కొత్తూర్, నందిగామ మండలాల ప్రజలు పనుల నిమిత్తం ప్రభుత్వ కార్యాలయాలతో పాటు, వ్యాపారపరంగా షాద్‌నగర్‌కు వచ్చి వెళ్తుంటారు. కొత్తూర్, నందిగామ మండలాల ప్రజలకు షాద్‌నగర్ ప్రాంతం రాకపోకలకు ఎంతో అనువుగా ఉంటుంది. అయితే, ఏసీపీ కార్యాలయం శంషాబాద్‌లో ఉండడంతో తాము ఇబ్బందులకు గురవుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని పనులకు షాద్‌నగర్‌కు, మరి కొన్ని పనులకు శంషాబాద్ వెళ్లాల్సి వస్తుందని వాపోతున్నారు. రెండు మండలాల ప్రజలు శంషాబాద్‌కు వెళ్లాలంటే దూరభారం కూడా. ప్రభుత్వ కార్యాలయాల పని నిమిత్తం షాద్‌నగర్‌తో పాటు శంషాబాద్‌కు వెళ్లాలంటే సమయం వృథా అవుతుందని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వెంటనే స్పందించి కొత్తూర్, నందిగామ పోలీస్‌స్టేషన్ల పరిధులను షాద్‌నగర్ ఏసీపీ కార్యాలయ పరిధిలోకి తిరిగి మార్చేందుకు కృషి చేయాలని ఆయా మండలాల ప్రజలు ఉన్నతాధికారులను కోరుతున్నారు.

ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు



కొత్తూర్, నందిగామ పోలీస్‌స్టేషన్లను శంషాబాద్ ఏసీపీ పరిధిలోకి మార్చడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నియోజకవర్గ ప్రజలు ప్రభుత్వ, ప్రైవేట్ పనుల నిమిత్తం తరచూ షాద్‌నగర్‌కు వచ్చి వెళ్తుంటారు. కొత్తూర్, నందిగామ మండలాల ప్రజలు శంషాబాద్ ఏసీపీ కార్యాలయానికి ప్రత్యేకించి వెళ్లాల్సి వస్తుంది. దాంతో సమయం వృథా అవుతోంది. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి ఏసీపీ పరిధిని తిరిగి షాద్‌నగర్ ఏసీపీ పరిధికి మార్చాలి.

- బి.దేవేందర్‌యాదవ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు

షాద్‌నగర్ ఏసీపీ పరిధిలోనే ఉండాలి



కొత్తూర్, నందిగామ పోలీస్‌స్టేషన్లు షాద్‌నగర్ ఏసీపీ పరిధిలో ఉంచాలి. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంతో పాటు, అన్ని ప్రభుత్వ కార్యాలయాలు షాద్‌నగర్ హెడ్‌క్వార్టర్‌లో ఉన్నందున ప్రజలు షాద్‌నగర్‌కు వచ్చి వెళ్తుంటారు. కొత్తూర్, నందిగామ పోలీస్‌స్టేషన్ల పరిధిని శంషాబాద్ ఏసీపీ పరిధిలో ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దూరభారంతో పాటు సమయం వృథా అవుతుంది. ఉన్నతాధికారులు స్పందించి కొత్తూర్, నందిగామ పోలీస్‌స్టేషన్ల పరిధులను శంషాబాద్ నుంచి షాద్‌నగర్‌కు మార్చాలి.

- జె.సుదర్శన్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు, కొత్తూర్

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో నలుగురికి తీవ్ర గాయాలు

- ఇద్దరి పరిస్థితి విషమం

మహేశ్వరం, జనవరి 4(ఆంధ్రజ్యోతి): కారు, లారీ ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో నలుగురికి తీవ్ర గాయాలు కాగా.. అందులో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ సంఘటన మహేశ్వరం పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై మధుసూదన్ కథనం మేరకు.. హైదరాబాదులోని మణికొండ, కొండాపూర్, ఎర్రగడ్డ ప్రాంతాలకు చెందిన నగేష్, వంశీ, శ్రీకాంత్, శ్రీధర్‌లు స్నేహితులు. వారు కియా కారులో శ్రీశైలం వెళ్లి వస్తుండగా శనివారం సాయంత్రం శ్రీశైలం-హైదరాబాద్ ప్రధాన రహదారి మ్యాక్ ప్రాజెక్టు వద్ద ఎదురుగా వస్తున్న కర్నాటకకు చెందిన లారీ కారును ఢీకొట్టారు. కారులో ఉన్న నలుగురు యువకులకు తీవ్రగాయాలయ్యాయి. నగేష్, వంశీల పరిస్థితి విషమంగా ఉండడంతో నగరంలోని ఓ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మధుసూదన్ తెలిపారు.


మాట్లాడుతున్న పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుదాం

షాబాద్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): మండల అధ్యక్షులు కలిసికట్టుగా పనిచేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. బీజేపీ మండల అధ్యక్షుల ఎన్నిక అభిప్రాయ సేకరణ షాబాద్‌లోని ఎంఎస్ గార్డెన్‌లో శనివారం నిర్వహించారు. ఎలక్షన్ రిటర్నింగ్ ఆఫీసర్‌గా విష్ణువర్ధన్‌రెడ్డి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. మండల అధ్యక్షులు పార్టీ అభివృద్ధికి కృషి చేస్తూ స్థానిక ఎన్నికల్లో మెజార్టీ సీట్లు గెలిపించవలసిన బాధ్యత తీసుకోవాలన్నారు. మండలాధ్యక్షుడు కిరణ్, నాయకులు వీసరి సతీష్‌రెడ్డి, రాము, మాణయ్య, మహేందర్, సురేష్, నారాయణ, మహేందర్, విజయ్‌కుమార్, బూత్‌స్థాయి అధ్యక్షులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బదిలీలకు బేరసారాలు!

(5వ పేజీ తరువాయి)

ప్రధాన కారణాలతో టీచర్లు అర్బన్ ప్రాంతాలకు బదిలీల కోసం పెద్ద ఎత్తున డబ్బులు ముట్టజెప్పేందుకు సిద్ధమవుతున్నారు. పరస్పర ఒప్పంద కోసం కొందరు టీచర్ సంఘాల లీడర్లే మధ్యవర్తులుగా ఉన్నట్లు సమాచారం. మేడ్చల్ జిల్లా ఈసీఐఎల్‌లో నివాసముంటున్న ఒక టీచర్ మరో నాలుగు నెలల్లో పదవీరమణ పొందనున్నారు. ఈ టీచర్ సంగారెడ్డి జిల్లాలో పనిచేసే మరో టీచర్‌కు పరసర్పర బదిలీ అయ్యేందుకు విల్లింగ్ ఇచ్చినట్లు సమాచారం, ఇందు కోసం రూ. 15 లక్షల వరకు పెద్ద మొత్తంలో ఒప్పంద కుదుర్చుకున్నట్లు తెలిసింది. వికారాబాద్ జిల్లాకు చెందిన ఓ టీచర్ మేడ్చల్ జిల్లాకు వచ్చేందుకు ప్రయత్నిస్తున్నాడు. మహబూబ్‌నగర్ జిల్లాలో పనిచేసిన ఓ టీచర్ ఇటీవలే స్పౌజ్ కింద రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్ మండలం చంపాపేట్‌కు ఇటీవలే బదిలీపై విచ్చేశారు. ఈ మాష్టారు ఆగస్టులో పదవీరమణ పొందనున్నారు. మ్యూచువల్ బదిలీల్లో భాగంగా వికారాబాద్ జిల్లాకు వెళ్లేందుకు రూ. 17.50 లక్షలు ఒప్పందం కుదుర్చుకున్నట్లు సమచారం. కాగా, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నాగోల్‌లో ఓ టీచర్, రంగారెడ్డి జిల్లాలోని నాగోల్‌లో మరో టీచర్ త్వరలో పదవీరమణ పొందనున్నారు. అయితే, వీరు మ్యూచువల్ బదిలీల్లో భాగంగా జూనియర్ టీచర్లతో రూ.15 లక్షలకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు సమాచారం. ఇకపోతే హైదరాబాద్ నగర శివారులోని స్కూళ్లకు పరస్పర ఒప్పంద దందా జోరుగా సాగుతోంది.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

శంకర్‌పల్లి, జనవరి4(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య తెలిపారు. శంకర్‌పల్లి మండల పరిషత్ కార్యాలయంలో శనివారం రోజున ఆయన షాదీముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులను 65మంది లబ్ధిదారులకు రూ.65,07540, ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఆరుగురు లబ్ధిదారులకు రూ. 3.28లక్షల చెక్కులను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేద ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పించడమే ముఖ్యమంత్రి సహాయ నిధి ఉద్దేశమన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం తప్పనిసరిగా నెరవేర్చుతుందని చెప్పారు. చైర్‌పర్సన్ విజయలక్ష్మి ప్రవీణ్‌కుమార్, వైస్‌చైర్మన్ వెంకట్‌రాంరెడ్డి, తహసీల్దార్ సరేందర్, ఇన్‌చార్జి ఎంపీడీవో గిరిరాజ్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, ఆర్ఐ తేజ, కౌన్సిలర్ చంద్రమౌళి, నాయకులు వెంకట్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, రఘునందన్‌రెడ్డి, కాశెట్టి చంద్రమోహన్, మధు తదితరులు పాల్గొన్నారు.


చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

నిరుపేదలకు అండగా సీఎంఆర్ఎఫ్

శంషాబాద్ రూరల్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు సీఎం రిలీఫ్‌ఫండ్ అండగా ఉంటుందని కాంగ్రెస్ సీనియర్ నాయకులు కె.చంద్రారెడ్డి, నార్సింగ్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ శ్రీకాంత్‌గౌడ్ అన్నారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ చొరవతో మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను శనివారం లబ్ధిదారులకు అందించారు. శంషాబాద్ మండలంలోని పెద్దగోల్కొండకు చెందిన చంద్రన్‌గుట్ట కుమార్, చంద్రన్‌గుట్ట దామోదర్‌లకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్‌గౌడ్, దండు ఇస్తారి, జీవన్‌గౌడ్, మోహన్‌నాయక్, అనేగౌని శ్రీధర్‌గౌడ్, కుమార్‌యాదవ్, భిక్షపతి, రాజశేఖర్ రెడ్డి, నజీర్, మహేశ్, సమీర్, మీడియా సెల్ అధ్యక్షుడు శ్రీధర్‌గౌడ్ పాల్గొన్నారు.


రేవంత్ రెడ్డిని సన్మానిస్తున్న గీతానర్సింహ, శ్రీనివాస్‌రెడ్డి

సీఎం రేవంత్‌ను కలిసిన ఏఎంసీ చైర్‌పర్సన్ గీత

ఆమనగల్లు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డిని శనివారం ఆమనగల్లు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ యాట గీతా నర్సింహ, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డిలు ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. చైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో సీఎంను కలిసినట్లు గీత చెప్పారు. మార్కెట్ అభివృద్ధి, రైతుల సంక్షేమానికి తోడ్పాటునందించాలని కోరగా సీఎం సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు. కడ్తాల మండల కేంద్రంలో 30 పడకల ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, జూనియర్ కాలేజీ, బస్టాండ్, అసంపూర్తి పనులకు నిధులు కేటాయించాలని కోరినట్లు శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఆమనగల్లు మండలంలో పలు సమస్యలను సీఎం దృష్టికి తీసుకుపోయిన ట్లు మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు.

కిసాన్ సంఘ్ గ్రామ నూతన కమిటీ

చేవెళ్ల, జనవరి 4(ఆంధ్రజ్యోతి): కందవాడలో భారతీయ కిసాన్ సంఘ్ గ్రామ కమిటీని శనివారం ఏర్పాటు చేశారు. జిల్లా సహాయ కారదర్శి సత్యనారాయణరెడ్డి, కోశాధికారి పెంటారెడ్డి ఆధ్వర్యంలో కందవాడ గ్రామం కిసాన్ సంఘ్ అధ్యక్షుడిగా కృష్ణారెడ్డి, కార్యదర్శిగా విశ్వనాథం, సభ్యులుగా రవీందర్‌రెడ్డి, బలవంత్‌రెడ్డి, సాయిగౌడ్, మల్లేష్, దశరథ్‌రెడ్డిలను ఎన్నుకున్నారు. నాయకులు వీరేశం, ఈశర్వప్ప, శివుడు, నర్సింహరెడ్డి, తదితరులు ఉన్నారు.

'బీఆర్ఎస్ పాలనలో ఆమనగల్లుపై తీవ్ర వివక్ష'

ఆమనగల్లు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఆమనగల్లు మున్సిపాలిటీ అభివృద్ధి పట్ల తీవ్ర వివక్ష చూపినట్లు బీజేపీ ఆమనగల్లు మున్సిపాలిటీ అధ్యక్షుడు శ్రీకాంత్‌సింగ్ ఆరోపించారు. ఆమనగల్లు వెనుకబాటుకు కారణమైన బీఆర్ఎస్ నాయకులు తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి కుట్ర రాజకీయాలు, అసత్య ప్రచారాలు సాగిస్తున్నారని అన్నారు. పట్టణంలో శనివారం కౌన్సిలర్లు, బీజేపీ నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్రీకాంత్‌సింగ్ మాట్లాడుతూ బీఆర్ఎస్ రెండు పర్యాయాల పాలనలో ఆమనగల్లుకు ఇచ్చిన నిధులు, చేసిన అభివృద్ధి ఏమిటో ఆ పార్టీ నాయకులు చెప్పాలన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్రానికి రెండు లక్షల ఇళ్లను మంజూరుచేస్తే ఆ నిధులను కేసీఆర్ పక్కదారి మళ్లించారని అన్నారు.

కనీస వేతనం చెల్లించాలి


శంషాబాద్ రూరల్ : మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

శంషాబాద్ రూరల్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): కనీస వేతనాలు అందించాలని శంషాబాద్ మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులు శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రుద్రకుమార్, జిల్లా కమిటీ సభ్యుడు నీరటి మల్లేశ్‌లు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు అందించాలని డిమాండ్ చేశారు. డి.నాగేశ్, జయేందర్, ప్రవీణ్, యాదమ్మ, ఇందిరక, తదితరులున్నారు.


ఆమనగల్లు : న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కార్మికులు ఆందోళన బాటపట్టారు. ఆమనగల్లు మున్సిపల్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో 48గంటల నిరసన దీక్ష చేపట్టారు. సీఐటీయూ జిల్లా నాయకుడు పెంటయ్య దీక్షను ప్రారంభించారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ఉద్యోగాలు క్రమబద్ధీకరించాలని, కార్మికులకు కాస్మెటిక్స అందజేయాలని, మరణించిన కార్మికుల దహన సంస్కారాలకు రూ.30వేలు అందించాలని డిమాండ్ చేశారు. పెంటయ్య మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం 6న కలెక్టరేట్ ఎదుట పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్మికుల సంఘం జిల్లా నాయకులు వగ్గు రవి, చిట్టబాబు, సుధాకర్, చిన్న, పట్టాబి, తదితరులున్నారు.

ఆదిభట్ల : మున్సిపాలిటీలో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, ఎన్ఎంఆర్ పద్ధతుల్లో పనిచేస్తున్న కార్మికులను పర్మనెంట్ చేసి, 2వ పీఆర్సీ ప్రకారం కనీస వేతనం అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు డి.జగదీష్ డిమాండ్ చేశారు. శనివారం మున్సిపాలిటీ ఆవరణంలో సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు నిరసన దీక్ష చేపట్టారు. సమస్యలు పరిష్కరించాలని మున్సిపాలిటీ కమిషనర్ బాలకృష్ణకు వినతి పత్రం అందజేశారు. జగదీష్ మాట్లాడుతూ.. కార్మికులకు ఏపీ ప్రభుత్వం కనీస వేతనం రూ.21,000 వేలు ఇస్తోందని, తెలంగాణా ప్రభుత్వం కూడా ఇవ్వాలన్నారు. 8 గంటల పని విధానం తీసుకురావాలన్నారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రేపు కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం ఉంటుందని, కార్మికులు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ మున్సిపాలిటీ కన్వీనర్ నర్సింహ, కార్మికులు బాబు, జగన్, రాజేందర్, ఉపేందర్, తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' పనులు ముమ్మరం చేయండి

యాచారం, జనవరి 4(ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పనులు అమలు చేయడంలో జిల్లాలో మండలాన్ని అగ్రభాగాన నిలపడానికి చొరవ తీసుకోవాలని ఎంపీడీవో జి.నరేందర్‌రెడ్డి తెలిపారు. శనివారం మండల కేంద్రంలో ఉపాధిహామీ సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతీ గ్రామంలో ఉపాధి లేని కూలీలను గుర్తించి పని కల్పించాలన్నారు. వంద రోజుల పాటు ఉపాధి చూపడానికి ఫీల్డ్ అసిస్టెంట్లు, సాంకేతిక నిపుణులు కృషి చేయాలన్నారు. నర్సరీల్లో మొక్కలు ఎండిపోకుండా చూడాలని, విధిగా రోడ్లవెంట ఉన్న మొక్కలకు ట్రాక్టర్‌తో నీరుపెట్టి కాపాడాలని సూచించారు. ఏపీవో లింగయ్య, ఈసీ శివశంకర్‌రెడ్డి తదితరులున్నారు.

మద్యం సేవించి వాహనాలు నడపొద్దు


తనిఖీల్లో సీఐ కృష్ణంరాజు సిబ్బంది

యాచారం, జనవరి 14(ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని హైదరాబాద్ గ్రీన్‌ఫార్మా సిటీ ఇన్‌స్పెక్టర్ ఎల్.కృష్ణంరాజు చెప్పారు. శనివారం సాయంత్రం కుర్మిద్దలో వాహనాలు తనిఖీ చేశారు. కార్లు, ద్విచక్రవాహనాదారులు విధిగా డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు అన్ని ధ్రువ పత్రాలు కలిగి ఉండాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని సూచించారు. తనిఖీలో ఎస్సై తేజంరెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

- **తలకొండపల్లి :** సావిత్రిబాయి పూలే జీవితాన్ని, పోరాట పటిమను ఆదర్శంగా తీసుకొని మహిళలు ముందుకు సాగాలని మండల విద్యాధికారి చంప్లా నాయక్, అమ్మఆదర్శ పాఠశాల చైర్మన్ లలితమ్మలు అన్నారు. మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్‌లో సావిత్రిబాయి జయంతి వారోత్సవాలను పురస్కరించుకొని మహిళా ఉపాధ్యాయినీను సన్మానించారు.
- **కడ్తాల్ :** రైతుల సంక్షేమానికి తన వంతు పాటుపడుతానని ఆమనగల్లు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గీత అన్నారు. మండల కేంద్రంలో శ్రీనివాస్‌రెడ్డి గీత నర్సింహను సత్కరించి అభినందించారు. వైస్ చైర్మన్ భాస్కర్ రెడ్డి, డైరెక్టర్ వెంకటేశ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బీచ్యనాయక్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.
- **శంషాబాద్ :** శంషాబాద్ మున్సిపాలిటీ సాతంరాయికి చెందిన పీసీసీ ఎస్సీ విభాగం ఉపాధ్యక్షుడు జె.నరేందర్ సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి న్యూఇయర్ శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషిచేస్తూనే ప్రజల సమస్యలు ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చి పరిష్కారమయ్యేలా చూడాలని సీఎం సూచించినట్లు నరేందర్ తెలిపారు.
- **కందుకూరు :** చదువుకు పేదరికం అడ్డు కాదని ఉల్లాస్ ట్రస్ట్ డెలివరీ మేనేజర్ డి.బాలకృష్ణ అన్నారు. మండలంలోని నేదునూరు, కందుకూరు, గూడూరు ఉన్నత పాఠశాలల్లో 9, 10వ తరగతి విద్యార్థులకు శనివారం ఉపకార వేతనాలను అందజేశారు. నేదునూరు ఉన్నత పాఠశాలలో 9, 10వ తరగతి విద్యార్థుల్లో 10మందికి రూ.వెయ్యి చొప్పున ఉపకారవేతనం అందించినట్లు చెప్పారు. గూడూరు, కందుకూరు బాలురు, బాలికల ఉన్నత పాఠశాలలోనూ 10మందికి అందించినట్లు తెలిపారు. సంస్థ మేనేజర్ శిరీష, తదితరులు పాల్గొన్నారు.
- **కడ్తాల్ :** మైసిగండికి చెందిన రాష్ట్ర గిరిజన నేత, ప్రముఖ సంఘ సేవకుడు వి.హర్యానాయక్ సంతాప కార్యక్రమాన్ని మైసిగండిలో నిర్వహించారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పాల్గొని హర్యనాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమనగల్లు మార్కెట్ వైస్‌చైర్మన్ భాస్కర్‌రెడ్డి, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్యనాయక్, అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బీచ్యనాయక్, మాజీ ఎంపీటీసీ లచ్చిరామ్ నాయక్, తదితరులున్నారు.
- **కడ్తాల్ :** మండల కేంద్రంలోని ఫార్చ్యూన్ బటర్‌ఫ్లై స్కూల్లో క్రికెట్ టోర్నమెంట్ అట్టహాసంగా కొనసాగుతోంది. డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి తండ్రి నారాయణ రెడ్డి స్మారకార్థం కడ్తాల ప్రీమియర్ లీగ్-3 పోటీలను ఏర్పాటు చేశారు. మూడో రోజు ఆరు టీంలు టోర్నమెంట్‌లో పాల్గొన్నాయి.
- **కడ్తాల్ :** ఎమ్మెల్సీ కవితను రాష్ట్ర సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో కలిసి కవితకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. తాజా మాజీ సర్పంచులు బిల్లులు అందక పడుతున్న ఇబ్బందులను కవిత దృష్టికి తీసుకుపోయినట్లు ఆ యన చెప్పారు.
- **షాబాద్ :** ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కల్గి ఉండాలని మాజీ సర్పంచ్ జయమ్మసుదర్శన్ అన్నారు. ముద్దెంగూడలో హనుమాన్ జయంతి సందర్భంగా ఆలయంలో గ్రామస్థులతో కలిసి పూజలు నిర్వహించి, శోభయాత్ర చేపట్టారు. గ్రామస్థులు పాల్గొన్నారు.

షాబాద్ : మహిళాభ్యున్నతికి సావిత్రిబాయి పూలే చేసిన కృషి గొప్పదని టీఎస్ఎస్‌వో రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మీనివాస్ అన్నారు. షాబాద్‌లోని ఆమన్‌గల్ గురుకుల స్కూల్‌లో ప్రిన్సిపాల్ వినోల, ఉపాధ్యాయులను సన్మానించి, సావిత్రి బాయిపూలే చిత్రపటాన్ని అందజేశారు.

తలకొండపల్లి : గట్టిప్పలపల్లిని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని జేఏసీ నాయకులు కోరారు. ఈ సందర్భంగా శనివారం గట్టిప్పలపల్లి సమీప గ్రామాలు, తండాల ప్రజలు పెద్దఎత్తున నిరసన తెలిపారు.

విద్యా సంస్థల్లో వసతుల కల్పనకు రూ.20.43 కోట్లు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): కల్వకుర్తి నియోజకవర్గంలోని విద్యాసంస్థల్లో వసతుల కల్పనకు రూ.20.43 కోట్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు జారీ అయినట్లు చెప్పారు. కడ్తాల మండలం మైసిగండి గ్రామంలో శనివారం పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, ఆమనగల్లు మార్కెట్ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మనాయక్, మాజీ ఎంపీపీ కమ్లీమోత్యనాయక్ లతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యాభివృద్ధికి, పాఠశాలల్లో వసతుల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందన్నారు. ఉన్నత విద్యాశాఖ ద్వారా మాడ్గుల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అదనపు తరగతి గదులు, మరమ్మతులు, ఆధునీకరణ పనులకు రూ.2కోట్లు విడుదలైనట్లు చెప్పారు. మాడ్గుల మండలంలోని ఆరు పాఠశాలల్లో వసతుల కల్పనకు రూ.8.43 కోట్లు, మాడ్గుల ఉన్నత పాఠశాలకు రూ.2.83 కోట్లు, మాడ్గుల కేజీబీవీకి రూ.1.31 కోట్లు, పెద్ద మాడ్గుల పాఠశాలకు రూ.82లక్షలు, నర్సంపల్లి పాఠశాలకు రూ.82 లక్షలు, జేపీ నగర్ పాఠశాలకు రూ.85లక్షలు కేటాయించడం జరిగిందన్నారు. సీఎం రేవంత్ చదువుకున్న వెల్దండ మండలం తాండ్ర ఉన్నత పాఠశాలకు రూ.5 కోట్లు మంజూరయ్యాయని నారాయణరెడ్డి చెప్పారు. వెల్దండ బాలికల ఉన్నత పాఠశాలకు రూ.80 లక్షలు, వెల్దండ ప్రాథమిక పాఠశాలకు రూ. 20 లక్షలు, వెల్దండ బాలుర ఉన్నత పాఠశాలకు రూ.2కోట్లు, వెల్దండ మోడల్ స్కూల్‌కు రూ.50 లక్షలు, వెల్దండ కేజీబీవీకి రూ.కోటి, వెల్దండ సోషల్‌వెల్ఫేర్ గురుకుల పాఠశాలకు రూ.50 లక్షలు ప్రభుత్వం నుంచి విడుదలైనట్లు కసిరెడ్డి వివరించారు. పనులను త్వరలో ప్రారంభించడం జరుగుతుందన్నారు. డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్యనాయక్, మాజీ జడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ న్యాయ వాది లక్ష్మణశర్మ, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బీచ్యనాయక్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామంలో సంపూర్ణ మద్యపాన నిషేధం

- ఆదర్శంగా చించోడు గ్రామం

షాద్‌నగర్‌రూరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): తమ గ్రామంలో కొందరు మద్యానికి బానిసై సంపాదించినదంతా తాగుడుకే ఖర్చు చేస్తూ జీవితాలను నాశనం చేసుకుంటుండడంతో.. ఫరూఖ్‌నగర్ మండలం చించోడు గ్రామస్థులు సంచలన నిర్ణయం తీసుకున్నారు. తమ గ్రామంలో సంపూర్ణ మద్యపాన నిషేధాన్ని అమలు చేస్తూ శనివారం పార్టీలకతీతంగా ఊరంతా ఏకమై తీర్మానించారు. మద్యం అమ్మినవారికి రూ.50వేలు, కొన్నవారికి రూ.25 వేల జరిమానా విధిస్తామని, అమ్మినవారి ఆచూకీ తెలిపితే రూ.10వేల ప్రోత్సాహక బహుమతి ఇస్తామని, మద్యం సేవించి బహిరంగ ప్రదేశాల్లో ఇతరులను దూషిస్తే రూ. 25 వేలు, పేకాట ఆడుతూ దొరికితే రూ. 25 వేలు జరిమానా ఉంటుందని పేర్కొన్నారు. ఎన్నికల్లో ఏ పార్టీ నాయకులైనా తమ అనుచరులతో మద్యం పంపిణీ చేస్తూ దొరికితే ఆ పార్టీ వారికి రూ. 5 లక్షల జరిమానా విధిస్తామని తెలిపారు. ఈ మేరకు తీర్మాన పత్రాలను ఎక్సైజ్, పోలీసులకు అందించారు.


గ్రామంలో మద్యపానాన్ని నిషేధిస్తున్నట్లు తీర్మానం చేస్తున్న చించోడు గ్రామస్థులు

వేధింపులకు పాల్పడుతున్న కార్యదర్శిని సస్పెండ్ చేయాలి

షాబాద్, జనవరి 4(ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయితీ కార్మికులపై వేధింపులకు పాల్పడుతున్న సర్దార్‌నగర్ పంచాయతీ కార్యదర్శిని వెంటనే సస్పెండ్ చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ అన్నారు. ఈమేరకు కార్మికులతో కలిసి శనివారం ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికుల వేతనాలు కట్‌చేస్తూ వేధింపులకు పాల్పడుతున్న సర్దార్‌నగర్ పంచాయితీ కార్యదర్శిని వెంటనే సస్పెండ్ చేయాలన్నారు. కార్యక్రమంలో కార్మికులు నర్సింహ, పాపయ్య, శోభ, తదితరులు పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న దేవేందర్, కార్మికులు